క్లుప్తంగా

వేడుకగా చందనాలంకారం



నెల్లూరు(బృందావనం): అక్షయ తృతీయను పురస్కరించుకొని సంతపేటలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల రమాసహిత సత్యనారాయణస్వామి మందిరంలో విశేషాభిషేకా లు, పూజా కార్యక్రమాలను ఆదివా రం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వైభవ్ ఆచార్య ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, తదితరాలను జరిపా రు. సత్యనారాయణస్వామి, ఆంజనేయస్వామికి చందనాలంకారాన్ని నిర్వహించారు. సత్యనారాయణస్వామికి లక్ష మల్లెలార్చనను కనుల పండువగా జరిపారు. ఉభయకర్తలుగా వెంకటలక్ష్మి, వెంకట సంజీవరావు, తదితరులు వ్యవహరించారు. సింహ పురి మధ్వ సంఘ అధ్యక్షుడు ప్రవీణ్, రాఘవేంద్రస్వామి మఠ ప్రధానార్చకుడు రఘురామాచార్య, కంబలూరు వ్యాసపీఠ ప్రతిష్టాన కార్యనిర్వాహకుడు శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ సుధా రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు వెంకటసుబ్బారావు పర్యవేక్షించారు.

వైష్ణవిలక్ష్మిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక వసంత పరిమళ కొతాయి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు వైష్ణవిలక్ష్మి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు సుబ్బరామశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మి దంపతులు, సత్యనారాయణ, వ్యాసప్రసాద్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈట హేమచంద్రరావు, తదితరులు పర్యవేక్షించారు.

శేషవాహనంపై భగవద్రామానుజాచార్యులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాల్లో స్వామివారు శేషవాహనంపై ఆదివారం ఊరేగారు. మంగళశాసనోత్సవం, తిరుమంజనం, తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో కొలువైన అనంత కోదండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. భక్తులకు అన్నదానాన్ని జరిపారు. స్వామివారికి గరుడసేవ, తిరువీధి ఉత్సవాన్ని సాయంత్రం నిర్వహించారు. భరతనాట్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను భవానీ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఉభయకర్తలుగా రామయ్య, రాణి, చినపెంచలయ్య, సునీత, శ్రీనివాసులు, సుభాషిణి, వాసు, సంధ్య, నాగరాజు, లక్ష్మీప్రసన్న దంపతులు వ్యవహరించారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్షయ తృతీయను పురస్కరించుకొని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష మల్లెల పూజను విశేషంగా ఆదివారం నిర్వహించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, తదితరాలను అందజేశారు. ఉభయకర్తలుగా శేషగిరిరావు దంపతులు వ్యవహరించారు. అర్చకుడు సాయిభరద్వాజ, ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం ఊటుకూరు సచివాలయం-2 పరిధిలోని కంచరపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తుండంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల వితరణ

ఊటుకూరుకు చెందిన దివ్యాంగులు బాసల తిరుమల, పూడి చిన్న కృష్ణయ్య, రాగాల అరుణ, గుడిమెట్ల ఫణికుమార్, కరేటి నాగరాజుకు బ్యాటరీ ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే అందజేశారు. దివ్యాంగుల విజ్ఞప్తి మేరకు ఎన్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి రూ.35వేల విలువైన ట్రైసైకిళ్లను అందజేశారు. అలాగే కంచర్లపాళెంలో నివాసం ఉంటున్న పేర్ల సీతారామమ్మకు గుండె ఆపరేషన్ నిమిత్తం రూ.50 వేలు సాయం అందజేశారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. గడగప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఊటుకూరులోని పొదుపు మహిళలకు రూ.3లక్షల రుణం చెక్కును ఆయన అందజేశారు. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేస్తోందని తెలిపారు. పొదుపు సభ్యులు రుణాలను స్వయం ఉపాధికి వినియోగించుకుని సకాలంలో చెల్లించి మళ్లీ అధిక మొత్తంలో తీసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పొదుపు సభ్యుల ఆధ్వర్యంలో సూపర్‌మార్కెట్లు ఏర్పాటవుతున్నాయన్నారు. అదే విధంగా మన ప్రాంత సభ్యులు సూపర్‌మార్కెట్లు ఏర్పాటు చేసే విధంగా ఎదగాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పూండ్ల అచ్యుతరెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, సర్పంచ్ చౌటూరు శేషమ్మ, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ శేషమ్మ, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, ఏపీఎం శ్రీహరి పాల్గొన్నారు.



పొదుపు సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సోమిరెడ్డీ..సర్వేపల్లిలో పోటీ చేసే సత్తా ఉందా?

వెంకటాచలం: వరుస ఓటములతో ఉక్కిరిబిక్కిరవుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి పోటీచేసే సత్తా ఉందాని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య ప్రశ్నించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిరంతరం ప్రజల మధ్యనే తిరుగుతూ వారి అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. సీజనల్ పొలిటిక్స్ చేసే సోమిరెడ్డి ఈ విషయాన్ని జీర్ణించుకోలేక, ఇతర నియోజకవర్గాల నుంచి ఓటర్లను అద్దెకు తీసుకొచ్చి కండువాలు కప్పి సర్వేపల్లిలో టీడీపీలోకి వలసలంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఎర్రగుంటలో టీడీపీలో చేరినవారిలో ముగ్గురు తప్ప మిగిలిన వారికి సర్వేపల్లి నియోజకవర్గంలో ఓటు హక్కు ఉందని నిరూపించాలని సవాల్ విసిరితే సోమిరెడ్డి స్వీకరించలేదన్నారు. ఎన్నికల్లో వార్డు మెంబరుగా కూడా గెలవని చోటా నాయకులతో విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. మండలంలో పలు గ్రామాల ప్రజలు, దళితులను మోసం చేసి బతుకున్న మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మీకు ధైర్యం ఉంటే ఎర్రగుంటలో టీడీపీలో చేరినవారు ముగ్గురు కాదు, 153 మంది అని నిరూపించాలే గానీ, అలాకాకుండా ఇష్టం వచ్చినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, కసుమూరు సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

ప్రజల నమ్మకాన్ని చూరగొన్న సీఎం వైఎస్ జగన్

మనుబోలు: అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలోనే ఎన్నికల వాగ్దానాలు అన్నింటిని నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారని వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి దాసరి మహేంద్రవర్మ పేర్కొన్నారు. స్థానిక ఎరుకల కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి భాస్కర్‌గౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, వలంటీర్ స్వాతి, గృహసారథులు లక్ష్మి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

రౌడీ మామూళ్ల వసూళ్లపై ప్రశ్నిస్తే దాడులా!

కొడవలూరు: ఆటో స్టాండ్‌లో రౌడీ మామూళ్ల వసూళ్లపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం దారుణమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఖండించారు. నార్తురాజుపాళెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టీడీపీ నాయకుల వైఖరిపై మండిపడ్డారు. నార్తురాజుపాళెం కూడలి ప్రాంతం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన ఆటోలు వస్తుంటాయన్నారు. గతంలో ఆటోవాళ్ల నుంచి టీడీపీ నాయకులు రౌడీ మామూళ్లు వసూలు చేస్తుండగా ఎస్సై, పంచాయతీ అధికారుల ద్వారా అడ్డుకున్నామని తెలిపారు. అప్పట్నుంచి వసూళ్లకు విరామం ఇచ్చిన వారు మళ్లీ శనివారం నుంచి ఆరంభించారని చెప్పారు. ఈ విషయమై సర్పంచ్ భర్త ప్రశ్నించగా టీడీపీ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. అంతేకాకుండా కోవూరు ఆస్పత్రిలో చేరి భోగస్ కేసు పెట్టేందుకు యత్నించారన్నారు. తన అన్న కుమారుడు పొలంలో పని చేసుకుంటుండగా టీడీపీ నాయకులైన అమరేంద్రరెడ్డి, చక్కా మదన్, గరికపాటి రాజా, కరకటి మల్లి, దారా విజయ్‌బాబు, తదితరులు అక్కడికి వెళ్లి కులం పేరుతో దూషించారని ఆరోపించారు.

స్థాయి మరిచి విమర్శలు తగవు

కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తన స్థాయిమరిచి విమర్శలు చేయడం మానుకోవాలని వీరి చలపతిరావు హితువుపలికారు. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో తప్పటడుగులు వేస్తున్న దినేష్‌రెడ్డి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన, మంత్రిగా పనిచేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని నాలుక కోస్తానంటూ హద్దు మీరి మాట్లాడడం అతడి అవివేకానికి నిదర్శనమన్నారు. కాజ్‌వే అంటే ఏమిటో కూడా తెలియకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కాజ్‌వే నేలపై వేసే రోడ్డు మార్గం కాగా, ఫిల్లర్లు వేశారని మాట్లాడడం చూస్తే ఆయనకు ఏ మేర అవగాహన ఉందో అవగతం చేసుకోవచ్చన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదువుతూ ఆయన విమర్శలు చేస్తుండడం దురదృష్టకరమన్నారు. దినేష్‌రెడ్డి తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి రాజకీయ ఓనమాలు నేర్పింది ఎవ్వరో ముందు తెలుసుకోవాలన్నారు. ఏ శాఖలో ఏ అధికారులు ఉంటారో కూడా తెలియని పోలంరెడ్డికి తాను అన్నీ నేర్పానని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జీ జ్యోతి, సర్పంచ్‌లు బీ సుప్రియ, ఎం రమేష్, ఎపీటీసీ ఎం కామేశ్వరి, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎన్ మాణిక్యరావు, పీ మధుసూదన్‌రెడ్డి, నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, ఎండీ కరిముల్లా, బొచ్చు శ్రీనివాసులు, చక్కా మనోహర్, కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చలపతిరావు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

ముత్తుకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 359 మంది దరఖాస్తు చేసుకోగా, 313 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ సీహెచ్ సుజాత తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరిగిన జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు 262 మంది దరఖాస్తు చేసుకోగా, 212 మంది హాజరైనట్లు వెల్లడించారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలు జరిగాయి.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కోవూరు విద్యార్థి సత్తా



బంగారుపతకం సాధించిన దుర్యోదన

కోవూరు: రాష్ట్రస్థాయి పదో జూనియర్ పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో కోవూరు డిగ్రీ కళాశాల విద్యార్థి జీ దుర్యోదన సత్తా చాటాడు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో శని, ఆదివారాల్లో జరిగిన పోటీల్లో 53 కేజీల విభాగంలో రాణించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మే 12 నుంచి 17వ తేదీ వరకు తమిళనాడులో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పొదలకూరు : తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన మరుపూరు గిరిజన కాలనీకు చెందిన యాకశిరి సుబ్రహ్మణ్యం(17) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల19న సుబ్రహ్మణ్యం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత కుటుంబ సభ్యులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో తిరిగి జీజీహెచ్‌కు తీసుకొచ్చి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్సై కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పొదలకూరు : మండలంలోని పార్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం మోటార్‌బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి అదుపుతప్పి గేదెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..తిరుపతి జిల్లా గూడూరు మండలం మిట్టాత్మకూరు గ్రామానికి చెందిన మోపూరు మధుసూదన్‌రెడ్డి తన మామతో కలిసి పొదలకూరుకు మోటార్‌బైక్‌పై వస్తున్నాడు. పార్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి గేదెను ఢీకొనడంతో మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని బొల్లినేని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్కే కరిముల్లా తెలిపారు.

చల్లబడిన వాతావరణం

బుచ్చిరెడ్డిపాళెం: గత వారం రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన మండల ప్రజలకు ఆదివారం సాయంత్రం కాస్త ఉపశమనం లభించింది. సాయంత్రం వేళ వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమైంది. చల్లగాలులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కాజ్‌వే నిర్మాణంపై మాట తప్పిన పోలంరెడ్డి

ఇందుకూరుపేట: గత ప్రభుత్వ హయాంలో కాజ్‌వే నిర్మిస్తానని ప్రగల్భాలు పలికిన మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చివరికి చేతులెత్తేసి మాట తప్పగా, తమ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ టెండర్ల వరకు తీసుకొచ్చి నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ముదివర్తిపాళెం, ముదివర్తి గ్రామాల మధ్యన పెన్నానదిపై కాజ్‌వే నిర్మిస్తానని తండ్రి పోలంరెడ్డి బాకా ఊదిన విషయాన్ని దినేష్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. తన తండ్రి పోలంరెడ్డి రూ.16 లక్షలు ఖర్చు చేసి అంచనాలు వేయించాడని ఆయన చెప్పడం అవాస్తవమన్నారు. అప్పటి ప్రభుత్వ ప్రతిపాదనలు ఏమైనాయో చెప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కోవూరు నియోజకవర్గ సరిహద్దులే సరిగా తెలియని నీవు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రసన్నను విమర్శించడం తగదన్నారు. నల్లపరెడ్డి కుటుంబం నిత్యం ప్రజల కోసం పాటుపడుతుందన్నారు.

టీడీపీ నాయకులు రెచ్చగొడుతున్నారని ఫిర్యాదు

రాజ్యాంగబద్ధమైన స్పీకర్, ఎమ్మెల్యేలను కుక్కలతో పోలుస్తూ టీడీపీ నాయకులు రెచ్చగొడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు దుయ్యబట్టారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించిన టీడీపీ నాయకులు వీరేంద్ర, చెంచుకిషోర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్రశాంతంగా ఉండే మండలంలో కొత్త సంస్కృతికి తెరలేపుతున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్నను గాలివాటంలో గెలుస్తాడని మాట్లాడం ఏమిటని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీని చూసైన ప్రసన్నశక్తి అంటే ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై వెంకటరాజేష్‌కు ఫిర్యాదు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి, బీవీ రమణయ్య, షబ్బీర్, వెంకురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంగం వెంకయ్య, విజయ్‌భాస్కర్, దిల్షాద్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఇందుకూరుపేట: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు గురజాల బుజ్జిబాబు, రవికుమార్, వాసు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల అభిప్రాయాలను నమోదు చేస్తున్న దృశ్యం

చీటింగ్ కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లించకుండా మోసం చేయడంపై ఆదివారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఇనగలూరు వెంకటేశ్వర్లుకు బుచ్చిరెడ్డిపాళెం ప్రధాన కూడలి సమీపంలో కొంత స్థలం ఉంది. ఈ స్థలం గత కొంత కాలంగా వివాదంలో ఉంది. దీనిని అదునుగా చేసుకున్న బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి స్థలాన్ని తన పేరుపై రిజిస్టేషన్ చేస్తే వివాదం ముగుస్తుందని మాయమాటలు చెప్పి చేయించుకున్నాడు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తానన్న నగదు ఇవ్వకపోవడంతో బాలకృష్ణారెడ్డిని వెంకటేశ్వర్లు అడిగాడు. దీంతో నగదు ఎందుకు ఇవ్వాలని దౌర్జన్యం చేయడంతో పాటు దాడికి యత్నించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీలకు అవార్డులు

ముత్తుకూరు: ఈ నెల 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు ప్రభుత్వం ఆదివారం అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా మండలంలోని మూడు పంచాయతీలకు అవార్డులు దక్కాయి. పావర్టీ ఫ్రీ ఎన్‌హాన్స్‌డ్ లైవ్‌లీ హుడ్ విభాగంలో మల్లూరు, సోషల్లీ సెక్యూర్డ్ విభాగంలో పాటూరువారికండ్రిగ, ఉమన్ ఫ్రెండ్లీ విభాగంలో దువ్వూరువారిపాళెం పంచాయతీలను అవార్డులు వరించాయి. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంత్రుల చేతుల మీదుగా సోమవారం అవార్డులు ప్రదానం చేయనున్నారు.

పొదలకూరు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పులికల్లు పంచాయతీ జిల్లాస్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డును దక్కించుకుంది. అలాగే మండల స్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ, వాటర్ సఫిషియంట్, క్లీన్ అండ్ గ్రీన్, సెల్ఫ్ సెక్యూర్డ్ పంచాయతీ అవార్డులను సొంతం చేసుకుందిది. సర్పంచ్ గొడ్డేటి వెంకటసుబ్బమ్మ, కార్యదర్శి మాధవి అవార్డులను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామస్తుల సహకారంతోనే అవార్డులను సాధించగలిగామని పేర్కొన్నారు.

దినేష్‌రెడ్డీ..నోరు అదుపులో పెట్టుకో

కోవూరు: పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయుడు దినేష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలతతో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండ్రోజుల క్రితం దినేష్‌రెడ్డి ఎమ్మె ల్యే ప్రసన్నను విమర్శించారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచిన ప్రసన్న ప్రజల మధ్యనే ఉండే వ్యక్తి అన్నారు. ఆయన శక్తి సామర్థ్యాలను మీ తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డిని అడిగి తెలుసుకోవాలన్నారు. నియోజవర్గంలోని అనాథ పిల్లలు, ఆరోగ్య పరిస్థితులు సరిగా లేని అభాగ్యు లు, భర్త లేక ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళలకు ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ట్రస్టు చెక్కులు ఎక్కడ చెల్లుబాటు కాలేదో చెప్పాలన్నారు. మిడిమిడి జ్ఞానంతో ఇష్టమెచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. పోతిరెడ్డిపాళెం, గంగవరం సర్పంచ్‌లు నలుబోలు వాణి, యేడెం లక్ష్మీకుమారి, వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం అధ్యక్షురాలు వెంకమ్మ, జొన్నవాడ ట్రస్టు బోర్డు మెంబరు సుప్రజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళ ప్రజాప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో గోపూజ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో గోపూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ సమీపంలోని గోశాలలోని గోవులను శుభ్రం చేసి పసుపు, కుంకుమతో పూజించి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మహారుద్ర హోమాన్ని నిర్వహించారు. చెన్నైకు చెందిన సుదీప్, ఉదయభాస్కరణి, త్రియక్ష ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, పాలక మండలి సభ్యులు నందకుమార్, అర్చకులు పాల్గొన్నారు.



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

బుచ్చిరెడ్డిపాళెం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రచార భేరీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మిత్రులకు అండగా నిలుస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసేందుకు మోదీకి ఎలాంటి హక్కు లేదన్నారు. మోదీని ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి భయపెడుతున్నారని ఆరోపించారు. మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నుంచి దేశాన్ని కాపాడాలంటే ఆయన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు సురేష్, కృష్ణప్రసాద్, మల్లికార్జున, బుజ్జయ్య, రమణయ్య, మోహన్, బాబు పాల్గొన్నారు.



ప్రచార భేరీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మైపాడు బీచ్‌లో సందర్శకుల సందడి



ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరం చేరుకుని సేదతీరారు. రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకొన్న ముస్లింలు కుటుంబ సమేతంగా బీచ్‌కు చేరుకుని ఆహ్లాద వాతావరణంలో ఆనందంగా గడిపారు. దీంతో మైపాడు, నెల్లూరు ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. –ఇందుకూరుపేట